

# ఫేర్వెల్ రాజేశ్వరి

ఒక రాత్రి పదింటికి-

అప్పటివరకూ మాగన్నుగా పట్టిన మగతలోంచి బాబుకి అకస్మాత్తుగా మెలకువొచ్చింది. వాడికి భయమెయ్యలేదు.

ఇంకో రెండు నెలల్లో చచ్చిపోవటం ఖాయమని తెలిసిన కాన్సర్ రోగి మనసులో నిర్లిప్తతలా ఆ గదిలో చీకటి పేరుకుపోయింది. డబ్బు లేనివాడికి వచ్చే మలేరియా రోగంలా

ఆగి ఆగి కురుస్తోంది వర్షం. చచ్చి పోయినవాడి కాష్ఠం తగల బడుతూ వుంటే దూరంగా కూర్చొని చూచే వాడి మనసులో స్మశాన వైరాగ్యంగా నిశ్శబ్దం ఆ గదిలో పరుచుకొంది. ఇంత విరహాన్ని భరించలేక చూరులో ఎలుక అట్నుంచి ఇటు పరుగెత్తింది. ఐనా భయమెయ్యలేదు. అమ్మ చేతి క్రింది, అమ్మవెచ్చని కౌగిలిలో వాడికి భయం వెయ్యదు.

ఐనా - కడుపునిండా తిని పడుకొన్నవాడికి మెలుకువస్తే భయం వేస్తుంది. కడుపులో ఏవీ లేనివాడికి మెలుకువొస్తే ఆకలేస్తుంది.

బాబు మనసులో - మెదడులో - చేపల కదలిక మల్లే ఆలోచన్లు. వాటికి స్పష్టత లేదు. స్పష్టత నివ్వగలిగేటంత వయసులో పరిపూర్ణత బాబుకి లేదు. పక్కకి తిరిగి అమ్మవైపు చూసేడు.

తెల్లటి-మాసికలు పడి, పెచ్చులూడిపోయిన ఆ గది గోడల్ని చీకటి ముసుగువేసి కప్పేస్తోంది.

చలిగా వుంది.

నేలకి , శరీరానికీ మధ్య నిస్సహాయంగా వున్న చాపలోంచి చెమ్మ కొద్దిగా తగుల్తూంటే ముడంకె వేసిపడుకొన్న మనిషిని సూదుల్తో గుచ్చి సంతృప్తిపడే చలి. ఇరవై నాలుగుగేళ్ళ అబ్బాయిల్నీ, అరవై యేళ్ళ ముసలోళ్ళనీ నిద్రపోనివ్వని చలి. బాబుకి ఇరవై నాలుగేళ్ళు లేవు. వాడికి యేడేళ్ళు వాడు నిద్రపోకుండా వుండటానికి కారణం చలికాదు. అమ్మ వెచ్చని ఊపిరిలా చలి వాడి దరి చేరదు. వాడికి డొక్కల్లో నొప్పి వున్నట్టుండి వస్తోంది. అక్కణ్నుంచి గుండెల వరకూ పాకుతోంది.

బాబుకి అపెండిసైటిస్ లేదు. అదుంటే జనరల్ హస్పిటల్‌లో రెండు రోజులు 'బ్రెడ్డూ, పాలూ, ఇచ్చి ఆపరేషన్ చేద్దురు.

ఏవీ తినకపోతే మొదటిరోజు ఆకలి విజృంభిస్తుంది. రెండో రోజుకి అది చచ్చిపోతూంది. మూడో రోజుకి డొక్కల్లోచేరి దెయ్యమై పీడించటం మొదలు పెడుతుంది. నిన్నే ఆకలి బాబుకి దెయ్యమైంది.

బల్లెంతో గుచ్చుతున్నట్టూ పక్కల్లో నొప్పికి వెల్లకిలా పడుకున్నాడు. పక్కకి తిరిగేడు, లాభం లేకపోయింది. అప్పుడన్నాడు- 'అమ్మా!"

రాజేశ్వరి మాట్లాడలేదు. నిద్రపోవడంలేదు కూడా. ఆలోచిస్తూంది. ఆ గదిలోని తిమిర కల్మషంలోకి "రానా...వద్దా..." అని సంశయిస్తున్నట్టు వున్న వెలుగు రేఖల్ని తాటాకు సందుల్లోంచి చూస్తూ ఆమె అలోచిస్తూంది...

చుట్టూ నాలుగు గోడలూ, పైన కప్పూ వుంటే దాన్ని "గది" అనవచ్చు అంటే - అది గది. దాని వెనుకే ఇంకో గదిలాంటిది. దాని కప్పుమీద అక్కడక్కడ తాటాకుల్లేవు. అదే వంట గది. ఆ గదిలో కుంపటి వుంది. అది రాజేశ్వరి గుండేల్లోనూ వుంది.

నెలరోజుల క్రితం వరకూ ఆ గదిలో రాజేశ్వరీ, బాబూ, వాడి నాన్న వుంటున్నారు. ఇప్పుడు రాజేశ్వరీ. బాబూ వుంటున్నారు. ఇంకొన్నాళ్ళుపోతే వాళ్ళూ వుండరు. ఇంటద్దె ఇవ్వకపోతే.

ఆ గది అద్దే పదిరూపాయలు. నెల తిరిగేసరికి గ్యారంటీగా ఇచ్చెయ్యాలి. ఇల్లు కూలదని గ్యారంటీ లేదు. ఇల్లు ఇన్నాళ్ళకి కూలుతుందిని కాదు. పనిచేస్తూ పోయిన భర్త మరణానికి కాంపెన్‌సేషన్ ఇవ్వటం ఎగ్గొట్టిని ఫ్యాక్టరీ వాళ్ళగురించి కాదు. ఆ ఇంట్లో చేరిన దగ్గర్నుండీ ఎప్పుడు పడితే అప్పుడు కనబడితే చాలు. వంకరనవ్వు నిసిరే ఎదురింటి సోమేశ్వర్రావ్ గురించి అసలేకాదు. ఇకముందెలా అని.

పదిరోజుల్లో ఇల్లు ఖాళీ చెయ్యాలి. పరిస్థితి అంతవరకూ రాదు. ఇంకో రెండురోజులు భోజనం చెయ్యకపోతే ప్రాణం పోతుంది. ఈ చీరె చిరిగిపోతే కట్టుకోవటానికి ఇంకో చీరెలేదు. మానం పోతుంది. ప్రాణవూ మానవూ ఒకేసారి పోతే ఫర్వాలేదు. కానీ ప్రాణం పోకేపోతే -? ఈ వయసు, ఈ శరీరం - ఈ మనసు-ఈ బాబు-ఈ ప్రాణం పోకపోతే-

తాటాకు సందుల్లోంచి వర్షపు చినుకు మీదపడింది. కొద్దిగా కదిలింది.

"అమ్మా నిద్రరావటంలేదే..." అన్నాడు బాబు. మాట్లాడలేదు. రాజేశ్వరి. పక్కకు తిరిగి బాబు మీద చెయ్యేసింది. దూరంగా ఎక్కడో ఉరిమింది. బాబుని ఇంకా దగ్గిరగా తీసుకొంటూ "భయమేస్తోందా బాబు..." అనడిగింది.

"భయం కాదమ్మా...ఆకలి-" అన్నాడు బాబు.

ఏడుపు రాలేదు రాజేశ్వరికి. ఆ నాల్రోజులోనూ దాదాపుదిసార్లని ఉంటాడు ఆ మాట.

"కుండలో నీళ్ళుంటాయి కొద్దిగా తీసుకొని తాగు బాబూ, అర్థరాత్రిపూట ఎం ఉంటుంది."

బాబు లేవలేదు ఒక క్షణంపాటు. మళ్ళీ ఏమనుకున్నాడో ఏమో లేచి వెళ్ళి మంచి నీళ్ళు తాగొచ్చి పడుకున్నాడు. నొప్పి కొద్దిగా తగ్గినట్టనిపించింది. గంద్రగోళంగా అనుక్షణం స్పందిస్తే సంకీర్ణ ధ్వనుల నుంచి ప్రపంచం విశ్రాంతి తీసుకొంటున్నట్టూ వుంది. రాజేశ్వరి పైకప్పు కేసి చూస్తూనే వుంది. బాబు కొంచెం తల పైకెత్తి అన్నాడు.

"రేపు అన్నం వండుతావా అమ్మా"

రాజేశ్వరి ఉలిక్కిపడింది.

బాబు కళ్ళలో ఆశ మసగ్గా మెరిసింది.

"రేప్పొద్దునే వండుతాను బాబూ, సరేనా?"

బాబు క్షణం ఆగి "ఒట్టేనా" అన్నాడు అనుమానంగా. చటుక్కున కొడుకు భుజాల చుట్టూ చెయ్యి వేసి గట్టిగా దగ్గరకులాక్కుంది. ఎగిరెగిరి పడుతున్న ఆ రొమ్ముల మధ్య ఒక్క క్షణం వెచ్చదనం అనుభవించిన తరువాత తల్లి మొహంవైపు తలెత్తి చూసి బాబూ ఆశ్చర్యంగా అడిగేడు- "ఎడుస్తున్నావా అమ్మా?"

* * *

ఆ మరుసటి రోజు సాయంత్రం రాజేశ్వరి అన్నం వండింది.

నాల్రోజుల తర్వాత బాబు భోంచేసేడు. వెంటనే నిద్రముంచు కొచ్చింది. ముందుగదిలోకి వచ్చి పడుకున్నాడు. ఆ తర్వాత రాజేశ్వరి భోజనం చేసింది. కంచం

ఎత్తకుండానే వచ్చి బాబు పక్కన పడుకొంది.

అమ్మ చేతికింద బాబుకి భయం వెయ్యదు.

బాబు నిద్రలో కదిలేడు.

కంచం చుట్టూపడిన మెతుకుల్ని తింటోన్న ఎలుక బెదిరింది. అకస్మాత్తుగా రైడింగ్ జరిగితే పరిగెత్తే పెద్ద మనిషిలా ముందుకి దూకి బాబు మీదకి గెంతింది. బాబుకి అకస్మాత్తుగా మెలువొచ్చింది. కళ్ళు విప్పి చూసేడు. బాబూకి ఎందుకో ఆక్షణం భయం వేసింది.

"అమ్మా..." గొణిగేడు.

తాటాకుల్లేని చోటుల్లోంచి ఆకాశం కనబడింది.

కింది చాపలేదు.

చటక్కున లేచి కూర్చొని చుట్టూ తడిమేడు. అలికిన నేల తగిలింది.

కుంపటి...కంచం...వేలుకి అన్నం మెతుకు అంటుకొంది. ఉనికి అనుమానం వేసింది. లేస్తూమళ్ళీ "అమ్మా" అన్నాడు.

రాజేశ్వరి మాట్లాడలేదు.

రాజేశ్వరి లేదు.

చుట్టూ గోడలు మూసుకుపోతున్నట్టు పైనుంచి అకాశం క్రింది పడిపోతున్నట్టు తను అఘాతంలోకి జారిపోతున్నట్టు భ్రమ కలిగింది. గోడలమీద వికృతంగా నాట్యం చేసే నసీడలు బయంకరంగా తనని చుట్టు ముట్టుతున్నట్టు భ్రమ కలిగింది. అడుగు ముందుకు వేసేడు. కాలిబొటన వ్రేలికి గడప తగిలి జివ్వున లాగింది. ఏడుపురాలేదు.

తనకేదో అవమానం జరిగింది. తననందరూ మోసం చేస్తున్నారు. తను లేకుండా రాత్రి సాగుతోంది. తనులేకండా అమ్మ వుంది. తనతో రహస్యం పంచుకొంది. ఏడుపొచ్చింది

ద్వారం పట్టుకొని "అమ్మా..." అన్నాడు.

ఆ కంఠంలో ఆవేదన లేదు. భయం వుంది, గడప దగ్గర నిలబడ్డ బాబుని దూసుకొని బయటకు సోమేశ్వర్రావు వెళ్ళి పోయాడు. బాబు మిగిలేడు. రాజేశ్వరి మిగిలింది. తిమిరం, నీరసం తోడు తోడుగా మిగిలాయి.

రెండడుగులు వేసి లోపలికి వెళ్ళాడు.

ముందు మాట్లాడకుండా కమిట్ అయిపోయి, తరువాత యేం చేద్దామా అని ఆలోచించే విటుడి మనసులో సందిగ్ధంగా నీడలు ఆమె మీద అస్పష్టంగా పడుతున్నా బేరం కుదరక వెళ్ళిపోయేవాడిని చూస్తూ నిలబడ్డ ప్రాస్టిట్యూట్ మనసులో రెపరెపలాడే ఆశలా దీపం మినుక్కు మినుక్కు మని వెలుగుతోంది. నిశ్చలత్వానికి ఒక ఆకృతి తెచ్చుకొన్నట్టు వుంది.

బాబు ఇంకో అడుగు ముందు కేసాడు. తల్లి పక్కగా మోకాళ్ళమీద కూర్చుని కొద్దిగా దకంపిస్తోన్న స్వరంతో - "భయమేస్తోందే..." అన్నాడు.

రాజేశ్వరి కొద్దిగా పక్కకు జరిగిచోటిచ్చి - "ఇలా పడుకో బాబూ"అంది. బాబు

స్థలంలో ఇమిడిపోయాడు. తేలిగ్గా ఊపిరి పీల్చుకొని కళ్ళు మూసుకున్నాడు నిద్ర రాలేదు. కదిలే చేపల్లా ఆలోచన్లు, స్పష్టతలేని భావాలు, ఆకృతిలేకి రూపాలు.

ఏమీలేని శూన్యంలో ప్రచండమైన వేగంతో తిరుగుతోన్న అసంఖ్యాకమైన గోళాలమధ్య పిపీలిక పరిణామంతో తన వాస్తవం నిలబెట్టుకొనే ఈ చిన్న గోళం - దాని మీద ఇన్ని జీవాల స్ట్రగుల్ ఫర్ ఎగ్జిస్టెన్స్‌లో ఒక మారుమూల - ఒక పాకలో - రెండు ప్రాణులు - కాలం గుర్తింపని జీవాలు - మనకక్కరలేని వ్యక్తిత్వాలు.

మనం చీదరించుకొనే ఈ పరిణామాలు - మనం ఆలోచించని వాటి వెనుక పరిస్థితులు.

బాబు అన్నాడు - "నువ్వులేకపోతే నాకు భయమే అమ్మా! ఇంకెప్పుడూ నన్నిలా వదిలిపెట్టకే" మాట్లాడలేదు రాజేశ్వరి. హృదయం బద్ధలవకుండా నిర్లిప్తత కోట కట్టింది.

"చెప్పమ్మా" వత్తిడి చేశాడు.

ఆర్తి అవర్ణమైతే దానికి చెలియలికట్టేది?...అతడ్ని దగ్గరగా తీసుకొన్ని, "వదిలిపెట్టను సరేనా ఇక పడుకో" అంది.

బాబు కళ్లు మూసుకున్నాడు. బీటు కానిస్టేబుల్ విజిల్ వినపడుతోంది. ఈ లోకంలో అన్యాయాన్ని సాగనివ్వనట్టు దీనికి జవాబుగా దూరంగా తీతువుపిట్ట ఒకటి వికృతంగా అరుస్తోంది. బాబు కళ్లు తెరిచి, తల్లివైపు తిరిగి అడిగేడు- 'రేపు అన్నం వండుతావా అమ్మా'

❀ ❀ ❀

**(ఆంధ్రజ్యోతి - 1969)**